క్లుప్తంగా

15న 'విశాఖ ఉక్కు' కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గరిమెళ్ల ప్రెస్ క్లబ్‌లో ఈ నెల 15వ తేదీ ఉదయం పది గంటలకు 'విశాఖ ఉక్కు'కవి సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అరసం అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజా ఉద్యమాలతో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీరణ చేసే దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కవులు ఈ సమావేశానికి హాజరై తమ కవితలను చదవాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ సాహితీ, సాంస్కృతిక, ప్రజా సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా అట్టాడ అప్పలనాయుడు హాజరవుతారని పేర్కొన్నారు.

తాగునీటి నమూనా పరీక్షలపై అవగాహన



తాగునీటి నమూనా పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

జి.సిగడాం: గ్రామాల్లో డయేరియా, విష జ్వరాలు రాకుండా ఉండాలంటే తాగునీటిని పరీక్షించుకోవాలని, అప్పుడే వ్యాధులను నిర్మూలన సాధ్యవుతుందని ఎంపీడీఓ కె.నిశ్చల అన్నారు. బుధవారం తాగునీటి పరీక్షలు చేసే విధానంపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు జాగ్రతలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి తులసీప్రసాద్ సాహు, పొట్నూరు సురేష్, భూపతి నర్సింగరావు, పొగిరి రాము, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..



రాముడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని జీరుపాలెం గ్రామంలో మాగుపల్లి రాముడు బంధువు మాగుపల్లి కాములమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ఆమెను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మైలపల్లి కామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చీకటి యర్రయ్య, మైలపల్లి చిన్న తదితరులు ఉన్నారు.

కలెక్టర్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న గ్రామీణ రోడ్లు, చెరువులకు సంబంధించిన సమస్యలపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలిశారు. నియోజకవర్గ సమస్యలు త్వరతగతిని పరిష్కరించాలని కోరారు. కూటమి నాయకులు ఉన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



కోటపాలెంలో గణపతిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. కోటపాలెం, జీరుపాలెం గ్రామాల్లో గణనాథుడిని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బుధవారం దర్శించుకున్నారు. జే.ఆర్.పురంలోని కాపువీధిలో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద 12 అడుగుల వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు.

వరద బాధితులకు సత్యసాయి ట్రస్టు సాయం

శ్రీకాకుళం కల్చరల్: విజయవాడ వరద బాధితులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ద్వారా జిల్లా నుంచి కూడా సాయం అందించామని జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు తెలిపారు. బాధితుల కోసం నిత్యావసర సరుకులైన బియ్యం, కందిపప్పు, మంచి నూనె, పంచదార, చింతపండు, సబ్బులు మొదలగు 20 వస్తువులతో కూడిన ఏడువేల అమృత కలశాలు సత్యసాయి సెంట్రల్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ చేతుల మీదుగా అందచేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ సురేంద్ర పాల్గొన్నారు.

గంగమ్మ ఒడిలోకి గణనాథుడు



సందడిగా గణపతి ఊరేగింపు



ఇంటి నుంచి తిసుకొచ్చిన గణపతిని నదిలో నిమజ్జనం చేస్తున్న మహిళ



గణపతి నవరాత్రులు ఓ పక్క ఉత్సాహంగా కొనసాగుతుండగా.. మరోపక్క నిమజ్జనోత్సవాలు సైతం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు ప్రారంభమై బుధవారానికి ఐదు రోజులు పూర్తి కావడంతో చాలా మండపాల్లో ప్రతిష్టించిన వినాయక విగ్రహాలతోపాటు ఇళ్లల్లో పూజలందుకున్న బొమ్మలను నిమజ్జనం చేశారు. నగరంలోని కోటేశ్వరాలయం నాగావళి నది ఒడ్డున గణపతుల నిమజ్జనాలు బుధవారం జోరుగా జరిగాయి. నిమజ్జనాలు సందర్భంగా బొమ్మలను ఊరేగింపుగా కమిటీ సభ్యులు తీసుకొని వచ్చారు.

శ్రీకాకుళం కల్చరల్



గణపతిని తలపై ఉంచి నదిలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



నదిలో నిమజ్జనం చేస్తున్న యువకులు

రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు

- కోతకు గురైన ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించేందుకు బోటుపై వెళ్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాకుళం రూరల్: పెదగనగళ్లవానిపేట బీచ్ అభివృద్ధికి కృషి చేస్తామని, రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నాగావళినది వరద ఉద్ధృతికి కోతకు గురవుతున్న పెదగనగళ్లవానిపేట వద్ద సుముద్ర తీర ప్రాంతాన్ని బుధవారం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ముందుగా గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోటుపై కలెక్టర్, ఎమ్మెల్యే వెళ్లి నదీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నదీ ప్రవాహం తన దిశను మార్చుకోవడంతోనే సముద్ర ప్రాంతం కోతకు గురవుతుందన్నారు. దీనివల్ల గ్రామానికి వరద ముప్పు ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. గడిచిన కొన్నేళ్ల నుంచి ఈ సమస్య ఉందని.. మత్స్యకారులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే, కలెక్టర్ మత్స్యకారులకు భరోసా కల్పించారు. అలాగే గ్రామంలో పార్కును ఏర్పాటు చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చే ఈ బీచ్‌ను సుందరంగా, పర్యాటక కేంద్రంగా తీర్చుదిద్దుతామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్, జిల్లా పర్యాటక అధికారి నారాయణ, తహసీల్దార్ గణపతిరావు ఉన్నార.

ఆపదలో ఉన్నవారికి రెడ్‌క్రాస్ అండ



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ సుధీర్

శ్రీకాకుళం కల్చరల్: ఆపదలో ఉన్నవారికి రెడ్‌క్రాస్ అండగా ఉంటుందని ఆ సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ తొలి బృందానికి కొద్ది రోజులుగా ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వైస్ చైర్మన్, ప్రముఖ వైద్యులు కె.సుధీర్, సెక్రటరీ మల్లేశ్వరరావులు మాట్లాడుతూ.. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవ చేయాలని కోరారు. ఏడీఎఫ్ ఎం.వరప్రసాద్ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

14న ఘంటసాల గానావదాన పాటలు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న సుమిత్ర కళాసమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపుజీ కళామందిర్‌లో ఈనెల 14వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు డాక్టర్ సయ్యద్ రహమతుల్లాచే గానావదాన పాటలు, లఘునాటికల ప్రదర్శన ఉంటుందని సుమిత్ర కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావులు తెలిపారు. ఈ మేరకు అరసవల్లిలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని బుధవారం విడుదల చెశారు. 14 మంది కళాకారులతో ఈ ప్రదర్శన వినూత్నంగా ఏర్పాటు చేశామన్నారు. 'అహనాపెళ్లంట గీతానికి సూర్యకుమారిచే అభినయ నృత్యం, ఘంటసాల జీవిత చరిత్రలోని కొన్ని సన్నివేశాలతో లఘునాటికల ప్రదర్శన, ఘంటసాల పాటలతో కబాడి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు నక్క శంకరరావు, మండవల్లి రవి, నిక్కు హరిసత్యన్నారాయణ, మెట్ట పోలినాయుడు, ఎం.వరలక్ష్మి, జ్యోతి, సురేష్ ఉన్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం దోహదం



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆరోగ్యానికి పౌష్టికాహారం దోహదపడుతోందని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ అధికారిని జి.శోభారాణి అన్నారు. నగరంలోని కృష్ణాపార్క్ సెక్టార్ పరిధిలోని మహిళామండలి వీధి, తురాయి చెట్టు వీధి, వైష్ణవ వీధి అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రయోజనాన్ని వివరించారు. సెక్టార్ సూపరవైజర్ పి.సీతామహాలక్ష్మి, వార్డు ఇన్‌చారిజ ఎ.లత, ఆర్పీ పి.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 13న మండలంలోని 132/33 కేవీ చిలకపాలెం, 33/11కేవీ కొయ్యాం, పొన్నాడ, ధర్మవరం సబ్ స్టేషన్ల పరిధిలో అత్యవసర మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం, కొయ్యాం, కె.కె.నాయుడుపేట, డి.మత్స్యలేశం, కుప్పిలి, బడివానిపేట, నిమ్మవానిపేట, భగీరథపురం, పొన్నాడ, ముద్దాడ తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రణస్థలం మండలంలో..

రణస్థలం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అత్యవసర మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరప్పాలెం, బండిపాలెం, ముక్తుంపురం, పున్నానపాలెం, సంచాం, బంటుపల్లి, కంబాలిపేట, తిరుపతిపాలెం, ఎర్రవరం సబ్‌స్టేషన్ పరిధిలోని తెప్పలవలస, నీలంపేట, చిన్నపట్నానపేట, కొత్తపేట, చిల్లపేట, పాపారావుపేట, మీసాలబడి, సీతారాంపురం, దల్లిపేట, లంకపేట తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

వైభవంగా రాధాష్టమి



101 రకాల నైవేద్యాలు

రణస్థలం: కృష్ణాష్టమి నిర్వహించిన పదిహేను రోజులకు రాధాష్టమి చేపడతామని కోష్ట సమీపంలో ఉన్న శ్రీరాధాగోవింద మందిర సేవా భక్త సభ్యులు తెలిపారు. మందిరంలో రాధారాణి జన్మదిన వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 101 రకాల నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

పది సిలబస్‌లో మార్పులతో తీవ్ర నష్టం



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్

రణస్థలం: పదో తరగతి సిలబస్‌లో మార్పులు వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలను పరిశీలించి విద్యార్థుల విద్యా సామర్థ్యం, సిలబస్‌పై లోపాలను ఉపాధ్యాయులతో విశ్లేషించారు. పదో తరగతి సోషల్ టెస్ట్ బుక్‌లో 258 పేజీలు ఉంటే 167 పేజీలు యూరోపియన్ చరిత్రకు కేటాయించి, రాష్ట్ర చరిత్రకు అత్యంత తక్కువ పేజీలు ఇచ్చారని, ఇది విద్యార్థులకు ఎలా ఉపయోగమో చెప్పాలన్నారు. గత సంవత్సరం 9వ తరగతి హిందీ పుస్తకం చాలా ఇబ్బందికరంగా ఉందని, ఉపాధ్యాయులకు కూడా అర్థం చేసుకోలేని ఉత్తర భారతదేశం మాండలికాలు ఉన్నాయన్నారు. గతంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. భౌతిక శాస్త్రంలో మూలకాల వర్గీకరణ, పరమాణు నిర్మాణం, రసాయన బంధం లాంటి పాఠాలు తొలగించటం దారుణమన్నారు. గణిత సబ్జెక్ట్‌లో భవిష్యత్ పోటీ పరీక్షలకు సిద్ధపడేలా లేవన్నారు. ఇప్పటికైనా పాత పాఠ్యాంశాలను తిరిగి చేర్చాలని, పిల్లల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే పాఠ్యాంశాలను తొలగించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.నారాయణరావు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, ఎల్.కోదండరామయ్య, జిల్లా కోశాధికారి రవికుమార్, జిల్లా నాయకులు డి.కోటేశ్వరరావు, టి.శంకరరావు, కుమారస్వామి, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమపూజలో మహిళలు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీలోని గణపతి మండపంలో బుధవారం రాత్రి అధిక సంఖ్యలో మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. అర్చకులు ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, ఎల్‌బీఎస్ కాలనీ ప్రతినిధులు ద్వారపు అజిత్‌కుమార్, కాశిన ప్రసాదరావు, బూరవిల్లి మురళీకృష్ణ, బెహరా, శ్రీధర్, రొక్కం ప్రేమనాద్ మణిమాల, శారద పాల్గొన్నారు.

జగన్నాథవలసలో పొలంబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జి.సిగడాం: మండలంలోని జగన్నాథవలస గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి సూర్యకుమారి, మండల వ్యవసాయశాఖ అధికారి శారద ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు తీసుకుని అధిక రాబడులు సాధించాలన్నారు. మొక్కజొన్న పంట సాగు చేసుకుంటే పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



దేవరవలసలో సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం:

మండలం పరిధిలోని దేవరవలస, ఆనందపురం, వాంధ్రంగి, చీడిపేట, మధుపాం, చెట్టుపొదిలాం, చంద్రయ్యపేట, మెట్టవలస, పాలఖంద్యాం పాఠశాలల్లో బుధవారం ఏపీటీఎఫ్(1938) జిల్లా ఉపాధ్యక్షుడు వై.వి.రమణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 117 జీఓను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవిన విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం పథకం అమలు చేయాలన్నారు. పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. మండలంలో 80 శాతం వరకు ఏపీటీఎఫ్ సభ్యత్వం నమోదు చేశామన్నారు. వచ్చే నెలలో విజయనగరంలో నిర్వహించనున్న విద్య, వైజ్ఞానిక సభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు వల్లూరు రమణ, సభ్యులు రేగిడి సతీష్, ఉరిటి సతీష్ పట్నాయక్, తోలాపి రాము, కోరుకొండ ఉమామహేశ్వరావు, నిద్దాన లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

15 లోగా పంట నమోదు చేసుకోవాలి

మెళియాపుట్టి: ఈ నెల 15వ తేదీ లోగా పంట నమోదును ప్రతీ రైతు విధిగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి ధానకర్ణుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట నమోదు చేసుకుంటేనే బీమా సౌకర్యం, పరిహారాలు, మద్దతు ధర లభిస్తాయన్నారు.

గణపతికి గరికి పూజ



విజయగణపతికి సహస్ర గరికలతో పూజ



పుష్పాలతో సంపత్ వినాయకునికి అర్చనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతికి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం సహస్ర గరికలతో అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో సహస్రనా మార్చనలు జరిగాయి. అలాగే మంగువారితోటలో ఉన్న సంపత్ వినాయకుని ఆలయంలో 35 రకాల పూలతో, గరికతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

జీఓ 85ను రద్దు చేయాలి



జి.సిగడాం: బాతువలో నల్ల బాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న వైద్యులు

జి.సిగడాం: ప్రభుత్వం తక్షణమే జీఓ నంబర్ 85ను రద్దు చేయాలని బాతువ, జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, జి.అనూష, ప్రతిష్ఠ శర్మ, పేకల సుమబిందు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. జీఓ 85 వల్ల వైద్యుల సర్వీస్‌కు అర్థం లేకుండా పోతుందన్నారు. వైద్యులు పీజీ చేయడానికి అవకాశం ఉండదన్నారు. ప్రభుత్వం ఈ జీఓను రద్దు చేసి న్యాయం చేయాలన్నారు. లేకపోతే ఈ నెల16 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తామన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (ఏపీపీహెచ్‌సీడీఏ) వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పొన్నాడ పీహెచ్‌సీలో ఏపీ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు వైద్యులు ఎస్.శేషగిరి, పి.సౌమ్య నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు.

అద్భుత గ్రంథం కాశీఖండం



వక్త హరనాథరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: అద్భుత గ్రంథాలలో ఒకటి 'కాశీఖండం'మని విద్వాన్ పైడి హరనాథరావు అన్నారు. స్థానిక ఉపనిష్మందిరంలో సాహిత్య గణపతి ఉత్సవాలలో భాగంగా 'కాశీఖండం-ప్రాశస్త్యం' పై ఆధ్యాత్మిక ప్రవచనం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలాన్ని బట్టి మార్పులు చేస్తూ దీనిని ఏడు శ్వాసలలో గ్రంథంగా రూపొందించారని అన్నారు. ఇందులో ముఖ్యమైనది గుణనిధి కథ అని వక్త అన్నారు. వక్తను మందిరం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వేశ్వరరావు, పతంజలి శాస్త్రి, ఎం.మోహనరావు, కోమలరావు, అనూరాధ, సరస్వతి పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చిలకపాలెం గ్రామ సచివాలయంలో రైతు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలని, నారాయణపురం భూసాగుదారులకు హక్కులు కల్పించాలన్నారు. సన్న, చిన్నకారు రైతులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాలని, పంటలకు కనీస మద్దతు ధర అందించాలని, కరువు, వరదలు కారణంగా నష్టపోయిన పంటలకు బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. యాజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. జిల్లాలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రైతులు తోనంగి నందోడు, కోరాడ అప్పలరాజు, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.